సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 28 । మార్చి । 2025




వద్దన్నా వినరే..!

హైవే, సర్వీసు రోడ్లపై అనుమతి లేని చోట భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - IIలో



ఆరు ప్రైవేటు బస్సులు సీజ్

జిల్లా ప్రజారవాణా శాఖ, రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. అనుమతి లేకుండా తిరుగుతున్న ఆరు ప్రైవేటు బస్సులను సీజ్ చేశారు. - IIలో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
శుక్ర (సా)	శని (ఉ)
6.11	4.37

న్యూస్‌రీల్

థర్మల్ ప్లాంట్‌తో ముప్పు



వెన్నెలవలసలో నిరసన వ్యక్తం చేస్తున్న థర్మల్ ఉద్యమ నేతలు

సరుబుజ్జిలి: ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కలిసికట్టుగా ఉద్యమం చేయాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.దానేష్ పిలుపునిచ్చారు. గురువారం థర్మల్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాలైన వెన్నెలవలస, మసాను పుట్టి, జంగాలపాడు గిరిజన ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని పంట పొలాల్లో థర్మల్‌ప్లాంట్ నిర్మించడం వల్ల భూములు బీడుగా మారే ప్రమాదముందని చెప్పారు. కూటమి నేతలు స్వప్రయోజనాల కోసమే థర్మల్ ప్లాంట్ ప్రతిపాదన ముందుకు తెచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో థర్మల్ పోరాట కమిటీ నేత సవర సింహాచలం, పీడీఎం రాష్ట్ర నేత పాలిన వీరాస్వామి, ఉద్యమనేతలు, సురేష్‌దొర, ధర్మారావు, దుర్యోధన, వంకల మాధవరావు, గణేష్, గంగయ్య, వైకుంఠరావు, రామానాయుడు, నాగమణి, కోటి పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌పై ఎస్పీ ఆరా

నరసన్నపేట: ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి నరసన్నపేట పోలీసు స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు మూడు గంటలు స్టేషన్‌లో ఉండి పోలీసులు పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. నరసన్నపేటలో జరుగుతున్న క్రికెట్ బెట్టింగ్‌లపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను త్రైమాసిక తనిఖీలలో భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రత పరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈవీఎంలను ట్రిపుల్ లాక్ సిస్టమ్ ద్వారా భద్రపరిచామని, 24 గంటల సీసీటీవీ నిఘా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు, పీఎం జే బాబు, సురేష్‌బాబుసింగ్, ఎం.గోవింద్, బి.అర్జున్‌కుమార్, సీహెచ్ భాస్కరరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి పాల్గొన్నారు.



> గిరిజనులకు చెందిన జీవో నంబర్ 3 పునరుద్ధరిస్తాను. గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకే. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాను. 1/70 చట్టం సమర్థంగా అమలు చేస్తాను.. - పాతపట్నం, పలాసలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.

మాట తప్పడం బాబు నైజం

గిరిజనం పోరాట పథం



- ఓవైపు థర్మల్ పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం
- మరోవైపు ఐటీడీఏ కోసం ఆందోళన
- ఇంకోవైపు గిరిజన భూముల ఆక్రమణలపై నిరసన
- భవిష్యత్ కోసం ఎందాకైనా వెళ్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



ఇటీవల చలో కలెక్టరేట్ నిర్వహించిన గిరిజనులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం రైతులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులు ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేయగా.. తాజాగా గిరిజనులు సైతం పోరుబాట పట్టారు. అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా తమకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఆచరణకు నోచుకోకపోవడంపై మండిపడుతున్నారు. జీఓ నంబర్-3 పునరుద్ధరణ, ఐటీడీఏ ఏర్పాటును విస్మరించిన సర్కారు ఇప్పుడు గిరిజనుల భూముల్లో థర్మల్ పవర్ ప్లాంట్ పెడతామంటూ స్థానిక ఎమ్మెల్యేల ద్వారా ప్రకటనలు చేయిస్తూ చిచ్చు రేపడంపై ప్రభుత్వంపై మండిపడుతున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు మరింత ఆందోళనకు గురి చేశాయి. 1/70చట్టాన్ని సవరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందుని గిరిజనుల్లో ఆందోళన రేకెత్తించారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని గిరిజనుల్లో ఆగ్రహం పెల్లుబికింది. రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

గిరిజనుల సమస్యలివే..

జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని ఎన్నికల సభల్లో చంద్రబాబు చెప్పి గిరిజనులను మభ్యపెట్టారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రశ్నల రూపంలో అసెంబ్లీలో హడావుడి చేయడం తప్ప ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకురాలేకపోయారు.

జిల్లాలోని మందస మండలంలో కొండలోగం, పట్టులోగం, బుడంబో తదితర గ్రామాల్లో 300 ఎకరాల గిరిజనుల భూములు ఆక్రమణలకు గురయ్యాయి. అందులో గుడంబోలో గిరిజనులకు చెందిన ఐదెకరాల శ్మశాన వాటికను ఆక్రమించారు. తప్పుడు పత్రాలతో గిరిజనేతరులు ఆక్రమణలకు పాల్పడ్డారు. 1/70చట్టం కచ్చితంగా అమలై ఉంటే ఆక్రమణలకు ఆవకాశం ఉండేది కాదు. ఈ చట్టాన్ని సవరిస్తే తప్ప అభివృద్ధి సాధ్యం కాదని అయ్యన్నపాత్రుడు లాంటి వారు వ్యాఖ్యలు చేయడం ఆక్రమణలకు మరింత ఊతమిచ్చినట్లయ్యింది. జీవో నెంబర్ 3 పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా ఇంతవరకు దానిని ఆచరణలో పెట్టలేదు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ఉద్యోగాలూ గిరిజనులకే దక్కేవిధంగా చేస్తానని చెప్పినా ఇంతవరకు ఆ జీవోపై కోర్టులో ప్రభుత్వం తరపున అఫిడవిట్టే దాఖలు చేయలేదు.



ప్రభుత్వ తీరును నిరసనగా గిరిజనులు ఇటీవల నిర్వహించిన ధర్నా

పోరాటాలకు సన్నద్ధం..

ఇలా పలు సమస్యలు, వివిధ డిమాండ్లతో జిల్లాలోని గిరిజనులు ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పటికే చలో కలెక్టరేట్ నిర్వహించి నిరసన తెలిపారు. ముమ్మందు మరింత పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. అవసరమైతే ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధమని.. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు వెనక్కి తగ్గేది లేదని గిరిజనులు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..



ఐటీడీఏ లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన భూములకు రక్షణ కరువైంది. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. జీవో-3 ప్రకారం గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. గిరిజన గ్రామాల్లో నాణ్యత లేని రోడ్లు వేస్తున్నారు. మంచి నీటి ఇబ్బందులూ ఉన్నాయి. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం.

– నిమ్మక అప్పన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

అడుగడుగునా అన్యాయం..

జిల్లాలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు జరగడం లేదు. ముఖ్యంగా చీపుర్లు, చింతపండు తదితర ఉత్పత్తులను గిట్టుబాటు ధర కల్పించడం లేదు. ఇక, జిల్లాలో 1200 ఎకరాల కొండపోడు భూములకు సంబంధించి 430 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది. గిరిజనులకు ఇళ్లు, స్థలాలకు సంబంధించి సుమారు 10 వేల మంది పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. మెళియాపుట్టి, మందస, హిరమండలం, పాతపట్నం, ఎల్ఎన్‌పేట, సారవకోట, కంచిలి, బూర్జ తదితర మండలాల్లో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక, తాగునీరు, రోడ్ల సమస్య చెప్పక్కర్లేదు.

చిచ్చురేపుతున్న థర్మల్ ప్లాంట్..

థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో ప్రభుత్వం చిచ్చురేపుతోంది. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో ఏర్పాటు చేయాలని చూస్తోంది. 3200 మెగావాట్ల థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటనలు కూడా చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే అంతు చూస్తామని బెదిరింపులకు కూడా దిగారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పవర్ ప్రాజెక్టుతో 20 గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని, పోడు వ్యవసాయం చేసే ఆదివాసీలు భృతిని కోల్పోతారని, పక్కనున్న గ్రామాలకు కూడా నష్టమేనన్న ఆవేదనతో ఉన్నారు. సహజ వనరులు కొల్లగొట్టడానికే ఈ ప్రాజెక్టు అని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

- 20 మందికి అస్వస్థత.. 13 మందికి ఆస్పత్రిలో చికిత్స
- ఆందోళనకు గురైన తల్లిదండ్రులు



అంబులెన్సులో విద్యార్థినులను తరలిస్తూ..

కాశీబుగ్గ / మందస : మందస మండలం గుడారి రాజపురం(జి.ఆర్.పురం) గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరగడంతో 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి అన్నం తిని నిద్రపోతున్న సమయంలో ఒక్కసారిగా వాంతులు, విరేచనలు కావడంతో వెంటనే సిబ్బంది స్పందించారు. సచివాలయ ఏఎన్ఎం సాయంతో ప్రథమ చికిత్స చేయించారు. అందులో 13 మంది విద్యార్థినులు గురువారం ఉదయానికి కూడా కోలుకోకపోవడంతో 108 అంబులెన్సులో హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారులు డాక్టర్ మద్దిల సంపతిరావు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మిలు వైద్యసేవలు అందించారు. ప్రమాదమేమీ లేనప్పటికీ ఎనిమిదో తరగతి విద్యార్థులైన భారతి, యమున, మోహిని, నవ్య, జాహ్నవి, గోపిక, సాహితి, శృతి, జ్ఞానశ్రీలను ఆస్పత్రిలోనే అబ్జర్వేషన్‌లో ఉంచారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై ఆస్పత్రికి చేరుకున్నారు. మందస పోలీసులు, మండల విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు ఆస్పత్రికి వచ్చి ఆరా తీశారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవికుమార్ పరామర్శించారు. అధికారుల పర్యవేక్షణ లేకే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. అనంతరం పాఠశాలను సందర్శించి వసతుల లేమి, భోజనం సరిగ్గా లేకపోవడంపై మండిపడ్డారు.



మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నం

- సోంపేట మండలంలో ఘటన

- II లో

టీచర్ల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి

- క్రిమినల్ కేసులు ఎత్తివేయాలి
- డీఈఓను తొలగించాలి
- కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ ఐక్య వేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కుప్పిలిలో పదో తరగతి పరీక్షల కాపీయింగ్ ఘటన నేపథ్యంలో ఉపాధ్యాయులపై అక్రమ సస్పెన్షన్లు, క్రిమినల్ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ.. ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ సీట్ల కోసం రూ.30 వేల నుంచి రూ.50 వేలు వరకు వసూలు చేశారన్న నెపంతో ఉపాధ్యాయులపై కేసులు పెట్టడం, సస్పెండ్ చేయడం దారుణమన్నారు. దీనికి పూర్తి బాధ్యులైన డీఈఓను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక, స్టీరింగ్ కమిటీ సభ్యులు డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సూర్యనారాయణలతో సమావేశమయ్యారు. వాస్తవ పరిస్థితి, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులపై చర్చించారు. డీఈఓను తొలగించి విచారణ చేయించాలని కోరారు. ఈ ఘటనలో సస్పెన్షన్లు ఎత్తివేయాలని, క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని, బాధిత విద్యార్థులకు వెంటనే పరీక్ష నిర్వహించాలని, లేనిపక్షంలో సప్లిమెంటరీ పరీక్షకైనా అనుమతించాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు ఎస్.కిషోర్, చౌదరి రవీంద్ర, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేలకు వినతిపత్రాల అందజేత

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులు, సిబ్బందిపై అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని, డిబారైన విద్యార్థులకు న్యాయం చేయాలని, డీఈఓ తిరుమలచైతన్యను విధుల నుంచి తప్పించాలని కోరుతూ శుక్రవారం నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపట్టి ఎమ్మెల్యేలకు వినతిపత్రాలను అందజేయనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ముఖ్య నాయకులు చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, మజ్జి మదన్‌మోహన్, దుప్పల శివరామ్‌ప్రసాద్, పిసిని వసంతరావు, ఎస్వీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు డీఈఓ కార్యాలయాన్ని మరోసారి ముట్టడిస్తామని, ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



- 14 శకటాలు, 184 మంది సిబ్బందితో సన్నద్ధం
- ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి
- 'సాక్షి'తో జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు

శ్రీకాకుళం క్రైమ్ :

వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. అక్కడక్కడా అగ్ని ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని.. సిబ్బంది సైతం ఫైర్ ఎమెర్జెన్సీ కాల్స్ పట్ల అలర్ట్‌గా ఉండాలని జిల్లా అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ అధికారి జడ్డు మోహనరావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రమాదాల అప్రమత్తత, సిబ్బంది విధివిధానాలు, శకటాలు, పరికరాల పనితీరును వివరించారు.



జడ్డు మోహనరావు, జిల్లా అగ్ని మాపక అధికారి

అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే 101 కాల్ చేయండి

మరో 68 మంది అవసరం..

జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, కోటబొమ్మాళి, ఆమదాలవలస, కొత్తూరు, రణస్థలంలోని అగ్నిమాపక కేంద్రాలకు శాశ్వత భవనాలు ఉన్నాయి. సోంపేట, నరసన్నపేటలో సెమీ పర్మినెంట్ భవనాలున్నాయి. మందస, పొందూరుల్లో ఔట్‌పోస్టు ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలో 45 మంది ఫైర్‌మ్యాన్‌లు, 23 మంది డ్రైవింగ్ ఆపరేటర్లు, 33 మంది లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు, ఎనిమిది మంది స్టేషన్ అధికారులున్నారు. జిల్లా సహాయక అగ్నిమాపక అధికారిగా వరప్రసాద్ కొనసాగుతున్నారు. ఔట్‌పోస్టు స్టేషన్లలో 25 మంది ఫైర్‌మ్యాన్‌లు, ముగ్గురు డ్రైవింగ్ ఆపరేటర్లున్నారు. వీరే కాక జూనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ ఒక్కరేసి చొప్పున, హోంగార్డులు 44 మంది వరకు ఉన్నారు. తనతో పాటు మొత్తం 184 మంది ఉన్నారని చెప్పారు. మరో 56 మంది ఫైర్‌మ్యాన్‌లు, పది మంది డ్రైవింగ్ ఆపరేటర్లు, సోంపేట, కోటబొమ్మాళి కేంద్రాల్లో ఫైర్‌స్టేషన్ అధికారులు భర్తీ కావాల్సి ఉంది.

ఇవి పాటించాల్సిందే..

- అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే ప్రజలు 101కు గానీ, సంబంధిత స్టేషన్ ఫోన్ నంబర్‌కు గానీ, స్టేషన్ అధికారికి గానీ ఫోన్ చేయాలి.
- ప్రజల నుంచి వచ్చే ఫైర్ కాల్స్ పట్ల క్షణాల్లో స్పందించకపోయినా, మరమ్మతులకు గురైన వాహనాలు తీసుకెళ్లి ప్రమాదాన్ని నియంత్రించలేకపోయినా సిబ్బందిపై చర్యలుంటాయి. కచ్చితంగా కండిషన్‌లో ఉన్న వాహనాలు, పరికరాలే తీసుకెళ్లాలి. ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి.
- మండలాలు, గ్రామాల పరిధిలో గుడిసెలు ఉన్న కాలనీలను సంబంధిత ఫైర్‌మ్యాన్, లీడింగ్ ఫైర్‌మ్యాన్లు దత్తత తీసుకుని ఎప్పటికప్పుడు ప్రమాద అవకాశాలున్న వీకర్ లొకేషన్లపై సమాచారం తెలుసుకోవాలి. అక్కడి ప్రజలకు ప్రమాదాలపై అవగాహన పర్చాలి.
- సర్పంచ్, వార్డుమెంబర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎఫ్‌పీషాప్ డీలర్లు, విలేజ్ సర్వెంట్లు, పోస్ట్‌మాస్టర్లే కాక ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీల ఫోన్ నెంబర్లు సిద్ధంగా ఉంచుకోవాలి.
- తక్షణ చర్యల్లో భాగంగా పరికరాలతో కూడిన మిస్ట్ బుల్లెట్ అందుబాటులో ఉంచుకోవాలి.
- 101 ఎమెర్జెన్సీ నెంబర్, స్టేషన్ ఎస్టీడీ నంబర్‌తో పాటు ప్రజలు ఫోన్ చేస్తే వెంటనే స్పందించేలా స్టేషన్ అధికారులు, సర్వీస్ ప్రొవైడర్లు మొబైల్ ఫోన్ నెంబర్లు ఉన్న సిమ్‌లు యాక్టివేట్ చేసుకోవాలి.
- గ్రామాలు, మండలాలు, వార్డులు, మున్సిపాలిటీలు పరిధి ముఖ్య కూడళ్లు, హోటళ్లు, సచివాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాలు, హెల్త్ సెంటర్లు, ఎఫ్‌పీఎస్ డీలర్ షాపులు, రైతుబజారు, మార్కెట్లలో స్కూళ్లు, పోస్టాఫీస్‌లు, బ్యాంకులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో సంబంధిత ఫైర్‌స్టేషన్ అధికారి మొబైల్ నెంబర్, స్టేషన్ నెంబర్, ఎమెర్జెన్సీ కాల్ 101 నెంబర్లు కనిపించేలా ప్రదర్శించాలి.
- జిల్లాలో గడ్డి ఇళ్లు, గుడిసెలు బాగా తగ్గాయి. పరిశ్రమలు, మాల్స్‌లో నిబంధనలు పాటించకపోవడం, సంబంధిత అగ్ని ప్రమాద పరికరాలు ఉండకపోవడం, అనుమతులు తెచ్చుకోకపోవడం వల్లే ఇటీవల ప్రమాదాలు సంభవించాయి. భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి నష్టం ఎక్కడ సంభవిస్తుందోనని పలువురు ప్రమాదమని తెలిసినా చొరబడేందుకు చూస్తారు. అది మంచిది కాదు.



అత్యవసర నంబర్లు..

స్టేషన్	స్టేషన్ ఆఫీసర్	మొబైల్	ఆఫీస్ నంబర్
శ్రీకాకుళం	ఎం.వరప్రసాద్	9963726782	08942222099
ఇచ్ఛాపురం	కె.ప్రశాంత్‌కుమార్	8317587461	08947231101
సోంపేట	ఎస్ మోహన్	9963744295	08947234101
పలాస	బి.సోమేశ్వరరావు	9963730662	08945241101
టెక్కలి	బి.సూర్యారావు	9000505945	08945244277
కోటబొమ్మాళి	పి.ఆర్.రెడి	9963730845	08942238659
నరసన్నపేట	ఎస్.వరహాలు	7680089447	08942276777
ఆమదాలవలస	కె.అప్పారావు	9963730658	08942286401
కొత్తూరు	ఎన్.బుచ్చోడు	9000873349	08946258444
రణస్థలం	పి.అశోక్	9963731326	08942234499
మందస	పి.కృష్ణారావు	9440939909	08947237101
పొందూరు	జి.ఇందుమతి	9491325930	08941242101



• వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజిన్

నీటి సామర్థ్యం 4,500 లీటర్లు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలు ఇరుక్కున్నా, నీటిలో మునిగిన వాహనాలను బయటకు తీయాలన్నా దీనిని ఉపయోగిస్తారు. ఎలక్ట్రిక్ రిమోట్ సాయంతో ఆపరేటర్ చేస్తారు. ఆయిల్ ప్రమాదాలు (పెట్రోల్, డీజిల్, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి) ఫోమ్ మేకింగ్ బ్రాంచిని ఉపయోగించి ఫోమ్‌ను స్ప్రే చేస్తారు. 360 డిగ్రీల కోణంలోనూ వాటర్ స్ప్రే చేయొచ్చు. సింగిల్ యూనిట్ అయితే 16 మంది, డబుల్ యూనిట్‌కు 32 మంది సిబ్బంది ఉంటారు.

• అడ్వాన్స్ (మల్టీపర్పస్)వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజిన్



నీటి సామర్థ్యం 4,500 లీటర్లు. సాధారణంగా వాటర్ ట్రెండింగ్ ఇంజిన్‌లో కింద నుంచి వాటర్ ప్రెజర్ కొడతారు. దీనికైతే పైన హ్యాండిల్ పట్టుకుని వాటర్ కొట్టవచ్చు. ఫోమ్, కార్బన్ డయాక్సైడ్ ఉంటుంది.



• ఫైర్ బుల్లెట్ బైక్స్

ఇదికూడా ఇరుకైన సందుల్లోంచి వెళ్లడానికి వీలుగా ఉంటుంది. 10 లీటర్ల ఫోమ్‌తో కూడిన నీళ్లుంటాయి. రెండు సిలిండర్లు ఉంటాయి. గ్యాస్ లీకైనప్పుడు త్వరగా ఫైర్ కటింగ్ అవుతుంది. ఆయిల్ ఫైర్ అయినప్పుడు ఫోమ్ ఉపయోగపడుతుంది.

ఫైర్ ఫైటర్స్



• రెస్క్యూ ఫైర్ ఇంజిన్

నీటి సామర్థ్యం 4,500 లీటర్లు. ఇది రోడ్డు, రైళ్లు, వరదలు, భూకంప ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగపడుతుంది. హైడ్రాలిక్ ఎక్విప్‌మెంట్ ద్వారా రైలు బోగీలను కట్ చేస్తాయి. నదులు, వాగుల్లో చిక్కుకుపోయే వారి జాడ తెలుసుకునేందుకు బ్రీతింగ్ ఆపరేటర్ ఉంటుంది. వారిని చూసేందుకు విడ్డింగ్ లొకేషన్ కెమెరా ఉంటుంది. బిల్డింగ్ బీమ్‌ల ఐరన్ కట్ చేయడానికి ఎలక్ట్రిక్, పెట్రోలుతో నడిచే రంపాలుంటాయి. ప్రమాదాన్ని బట్టి ఫైర్ సూట్, కెమికల్ సూట్ వేసుకుంటారు.



• మిస్ట్ జీప్

ఇది కాన్వాయ్‌లో ఉపయోగపడుతుంది. మినీ ఫైర్ ఇంజిన్ అని కూడా అంటారు. 200 లీటర్ల నీటి సామర్థ్యం ఉంటుంది. మిస్ట్ గన్‌తో ఫైర్‌ను కట్ చేస్తారు. ఈ గన్ నుంచి వెలువడే ఒక నీటి బిందువు అనేక మిల్లీ మైక్రాన్ అణువులుగా ఏర్పడి మంటలను ఆర్పుతుంది. చిన్న చిన్న సందుల్లోంచి వెళ్లేందుకు వీలుగా ఉంటుంది.



• ట్రూప్ క్యారియర్

ప్రమాదం సంభవించే ప్రాంతానికి అప్పటికప్పుడు సిబ్బంది వెళ్లేందుకు ప్రయాణంలో ఉపయోగపడేదే ట్రూప్ క్యారియర్. 30 మంది సిబ్బంది ఇందులో వెళ్లవచ్చు.

క్లుప్తంగా

అప్రోచ్ రోడ్డుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఆమదాలవలస రూరల్: మండలంలోని ఇసకలపేట, తొగరాం, కొత్తవలస తదితర గ్రామాల మీదుగా బలసలరేవు బ్రిడ్జికి నిర్మించనున్న అప్రోచ్ రోడ్డుకు గురువారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్థల పరిశీలన చేశారు. పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయిప్రత్యూష, తహసీల్దార్ రాంబాబు, సర్వేయర్ బి.గోపి, ఆర్ఐ పి.గోవిందరావు పాల్గొన్నారు.

గంజాయితో మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి తరలిస్తున్న మహిళను గురువారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ మొబైల్ సీఐ జి.వి.రమణ తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తుండగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద రంజువాలిక్ అనే మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా 10.3 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ తనిఖీల్లో సిబ్బంది విశలేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరు ప్రైవేటు బస్సులు సీజ్



సీజ్ చేసిన బస్సులివే

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ప్రజారవాణా శాఖ, రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బుడుమూరు, సీపన్నాయుడుపేట తదితర చోట్ల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా అనుమతులు లేకుండా తిరుగుతున్న ఆరు ప్రైవేటు బస్సులను సీజ్ చేశారు. కాంట్రాక్ట్ క్యారేజ్‌గా అనుమతులు తీసుకుని స్టేజ్ క్యారేజీలుగా నడుపుతున్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో సీట్లు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడాన్ని గమనించి సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు గంగాధర్, అనిల్, శిరీష, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



వేరే ట్రాక్టర్‌లోకి బియ్యం లోడ్ చేస్తున్న కూలీలు

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సివిల్ సప్లయ్ గోదాము నుంచి బియ్యం తీసుకెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. తొట్టెకు ఉన్న లింకు తెగిపోవడంతో కూలీలు ఒక్కసారిగా గెంతేశారు. అనంతరం అడ్డుగా రాళ్లు పెట్టి తొట్టె వెనుక జారకుండా అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. బియ్యం బస్తాలను మరో ట్రాక్టర్‌లోకి లోడ్ చేసుకుని వెళ్లారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



గాలిలోకి కాల్పులు జరుపుతున్న దృశ్యం

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఆర్మీ హవల్దార్ పైల ప్రతాప్ రెడ్డి మృతదేహం గురువారం ఢిల్లీ నుంచి స్వగ్రామమైన టెక్కలి చేరుకుంది. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్మీ అధికారులు మృతుని కుటుంబసభ్యుల సమక్షంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

వద్దన్నా వినరే..!

పాత్రునివలస హైవే సమీపంలో రిపేర్ పాయింట్ వద్ద ఆగిన లారీలు



- హైవే, సర్వీసు రోడ్లపై అనుమతి లేనిచోట ఆపుతున్న భారీ లారీలు
- వీటిని ఢీకొడుతూ ప్రమాదాలకు గురవుతున్న ఇతర వాహనాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ :

ఇటీవల లావేరు మండలం బుడుమూరు హైవే వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో అదుపు తప్పిన కారు.. రోడ్డుపక్కనే ఆగివున్న స్కూటీ, లారీలను ఢీకొట్టడంతో నలుగురు దుర్మరణం చెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయి. అధిక శాతం ఆగి ఉన్న వాహనాలు ముఖ్యంగా భారీ లారీలను ఢీకొట్టడం వల్లే చోటుచేసుకుంటున్నాయి. నిర్దేశిత పార్కింగ్ ప్రాంతం తప్ప మిగతా చోట్ల భారీ వాహనాలను ఆపవద్దనే నిబంధనలు ఉన్నా వాటిని డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పార్కింగ్ అనుమతి లేనిచోట..

హైవే రహదారులు, సర్వీసు రోడ్లు, గ్రామీణ రహదారులపై ఎక్కడపడితే అక్కడ భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఇతర వాహనాలు అదుపుతప్పి నేరుగా ఆగివున్న లారీలను, ఇతర భారీ వాహనాలను ఢీకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా అనధికారికంగా ర్యాంపుల్లోని ఇసుకను తరలిస్తున్న లారీలైతే ఒకేసారి గుంపుగా రావడం.. జిల్లాలోని రోడ్లపై వారి కంపెనీ తాలుకా మోటార్ రిపేర్ పాయింట్ల వద్ద గంటలు సేపు ఆపేయడం, ఇసుకను తరలించేందుకు అనుకూల సమయంలో ఒకేసారి వెళ్లడం వల్ల మిగతా వాహనదారులకు ఇబ్బంది కలగడమే



నరసన్నపేట సర్వీసు రోడ్డులో వద్ద బారులు తీరిన లారీలు

కాక ట్రాఫిక్ అంతరాయమవుతోంది. లోపల ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఉన్నా బయట సర్వీసు రోడ్లపైనే ఆపేస్తున్నారు. ఇది జిల్లాలోని నదీ పరివాహక ఇసుక ర్యాంపులున్న అన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది..

కలెక్టర్, ఎస్పీ మాటలు బేఖాతరు..

ఇటీవల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పీలు రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు. జిల్లాలో ఆంక్షలను కఠినతరం చేయాలన్న ఆదేశాలను అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని, ప్రమాదాలపై విశ్లేషించి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ శాఖల వారీగా ఆదేశాలిచ్చారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లలో చోటుచేసుకుంటున్నాయని, జాగ్రత్తలు తీసుకోవడంలో హైవే అధికారులు విఫలమవుతున్నారని ఎస్పీ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం



కలెక్టర్ ఉత్తర్వులు ఇప్పటికే అందాయి. హైవేపై అనుమతి లేనిచోట్ల పెద్ద పెద్ద వాహనాలు ఆపితే కఠిన చర్యలు, కేసులు నమోదు చేస్తాం.

– ఎ.పార్థసారథి, డీటీసీ, శ్రీకాకుళం

రామలింగస్వామికి 'ముంగిట సన్మానం'

శ్రీకాకుళం కల్చరల్: నాటక రంగం కోసమే లోకనాథం రామలింగస్వామి తన జీవితం అంకితం చేశారని పలువురు వక్తలు కొనియాడారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో రామలింగస్వామి ఇంటికి వెళ్లి 'ముంగిట సన్మానం' చేశారు. ఈ సందర్భంగా శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ మాట్లాడుతూ శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతి ఏడాది కళాకారుడి ఇంటికే వచ్చి సన్మానం చేయడం గొప్ప విషయమన్నారు.

కళాకారుల సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి పన్నాల నరసింహమూర్తి మాట్లాడుతూ 16ఏళ్లుగా ఎందరో కళాకారుల ఇళ్లకు వెళ్లి ముంగిట సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు, సమాఖ్య కార్యదర్శి బి.రామచంద్రదేవ్, బి.ఎ.



రామలింగస్వామి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మోహనరావు, కంచరాన అప్పారావు, పైడి సత్యవతి, బీఎంఎస్ పట్నాయక్, శివప్రసాద్, పాట్నూరు వెంకటరావు, నక్క శంకరరావు, బెహరా నాగేశ్వరరావు, కేశిరెడ్డి రాజేశ్వరి, జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. కార్జివీధికి చెందిన యర్రమ్మ కుటుంబ సభ్యులతో కలిసి తన పూరింటిలో నిద్రపోయింది. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కోడలు శేషమ్మ మేల్కొని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేసి బయటకు పరుగులు తీశారు. అగ్ని కీలలు ఎగసిపడటంతో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ స్పందించి స్థానిక యువకుల సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సుమారు రెండు లక్షల రూపాయల సామగ్రి, రూ.30వేలు నగదు కాలిపోయినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.



ఎగసిపడుతున్న అగ్నికీలలు

కొనఊపిరితో తమ్ముడు..
ఊపిరి తీసుకున్న అన్న

- వ్యాపారంలో నష్టాలు రావడంతో యాసిడ్ తాగేసిన తమ్ముడు
- బతకడం కష్టమన్న వైద్యులు
- మనస్థాపంతో ఉరి వేసుకున్న అన్నయ్య
- అలుదులో విషాదఛాయలు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రి బయట గదిలో ఓ వ్యక్తి గురువారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన శెట్టిసూరి, ఉమామహేశ్వరావులు అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి గ్రానైట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టడం.. నష్టాలు రావడంతో కొద్దిరోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట తమ్ముడు ఉమామహేశ్వరరావు తీవ్ర ఒత్తిడికి గురై యాసిడ్ తాగేశాడు. వెంటనే బాధితుడిని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. బతకడం కష్టమేనని వైద్యులు చెప్పడంతో మనస్థాపానికి గురై అన్నయ్య శెట్టి సూరి(40) ఆసుపత్రి బయట ఓ రూమును అద్దెకు తీసుకొని గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూమ్‌కు వెళ్లిన సూరి ఎంతకూ తిరిగి రాకపోవడంతో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బంధువులు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియజేశారు. సూరికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.



రూమ్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సూరి

కార్మికుల భద్రతపై దృష్టి సారించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వేసవి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా నమోదై వడగాలులు వీచే అవకాశముందనే రాష్ట్ర ప్రకృతి, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో దుకాణాలు, సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులరక్షణకు యజమానులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపకార్మిక కమిషనర్ అజయ్ కార్తికేయ సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ పరిశ్రమలు, సంస్థలు, కర్మాగారాలు, వర్క్‌షాపులు, ఇటుక బట్టీలలో పని చేసే కార్మికులపై ఎండ ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత యజమాన్యంపై ఉందన్నారు. కష్టతరమైన పనులు చేసే కార్మికులకు పనివేళలు రీషెడ్యూల్ చేయాలని, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్మికులను పనికి దూరంగా ఉంచాలని, ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో పనులు చేయించాలని సూచించారు. పని ప్రదేశంలో నీడ, తాగునీరు, అత్యవసర ఔషధాలు, ఓఆర్ఎస్ వంటి అందుబాటులో ఉంచాలని కోరారు.

ఎస్సీ విభాగం అధికార ప్రతినిధిగా యోగి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధిగా గుజ్జల యోగేశ్వరరావుని నియమిస్తూ తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్లు తెలిపారు. నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

29లోగా నవోదయ విద్యార్థులు రిపోర్టు చేయాలి

సరుబుజ్జిలి: జవహర్ నవోదయ ఫలితాలు విడులైన నేపథ్యంలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 29 లో గా ధ్రువపత్రాలను వెన్నెలవలస నవోదయ విద్యాలయానికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యాలయం పనివేళల్లో మాత్రమే సంప్రదించాలని పేర్కొన్నారు.

3న జెమ్స్‌లో అవగాహన సదస్సు

శ్రీకాకుళం రూరల్: వైద్య ఆరోగ్య రంగాల్లో నైపుణ్యాలు– ఉద్యోగ అవకాశాలపై జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో ఏప్రిల్ 3న అవగాహ న సదస్సు నిర్వహించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్, ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 7680945357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐపీఆర్‌పై అవగాహన అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: మేథో సంపత్తి హక్కు (ఐపీఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ (డీఐసీ) జనరల్ మేనేజర్ జి.ఎం.శ్రీధర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం మేథో సంపత్తి హక్కులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పరిశోధన, నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టి మేథో సంపత్తి హక్కులు పొందాలన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. సదస్సులో ఎంఎస్‌ఎంఈ సీఈవో సుదర్శన్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రతినిధి రాజు, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి యత్నం

సోంపేట: మండలంలోని బారువ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామంలో గురువారం దారుణ ఘటన చోటుచేసుకుంది. అమాయకురాలైన మానసిక దివ్యాంగురాలు స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి సకాలంలో ఇంటికి చేరుకుని కేకలు వేయడంతో యువకుడు పారిపోయాడు. అనంతరం భార్యకు విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏడు నెలలు కిందట కూడా ఇదేవిధంగా చేశాడని బాధిత యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పుడు మందలించి విడిచిపెట్టినా యువకుడి బుద్ధి మారలేదని వాపోయాడు. సభ్య సమాజానికి చెడ్డపేరు తీసుకువచ్చిన ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు కేసు నమోదు చేశారు. యువకుడ్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

అపరాల కొనుగోలు నమోదు ప్రక్రియ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లావ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు పండించిన అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మినుములు క్వింటా రూ.7,400, పెసలు క్వింటా రూ.8,682గా మద్దతు ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అపరాలు సాగుచేసి ఈ– క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు సమీప రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పంటను శుభ్రపరచి, జల్లెడ పట్టి సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళిత సంఘాల జేఏసీ నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దళిత పాస్టర్, సామాజికవేత్త ప్రవీణ్ పగడాల మృతికి సంబంధించిన బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలిలో దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. జగన్నాథం ,సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రామ్ గోపాల్ మాట్లాడుతూ నిందితులను శిక్షించడంతో పాటు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు బోసు మన్మధరావు, డేనియల్, అనంతరావు, సుధాకర్, రాంబాబు, రమణ, జాన్, కోటి, గోవింద్, శ్యామ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల లే ఆఫ్ ప్రతిపాదన రద్దు చేయాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్యామ్‌క్రగ్ పిస్టన్ కార్మికుల లేఆఫ్ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కల్పించాలని కోరుతూ మార్చి 29న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రణస్థలం మండలంలో గల శ్యాంక్రగ్ పిస్టన్స్(రింగ్స్) ప్లాంట్–2 పరిశ్రమలో 200 మంది కార్మికులను లే ఆఫ్ చేయకుండా యాజమాన్యాన్ని ఆదేశించాలని, బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మికులు ఏప్రిల్ 1 నుంచి పనిలో నుంచి తీసివేస్తారని భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.వెంకటరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిక్కాల గోవిందరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, శ్యాంపిస్టన్స్ ప్లాంట్–3 వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

4న రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ : రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ ఫిజిక్ మోడలింగ్ కాంపిటేషన్ పోటీలను ఏప్రిల్ 4న భీమవరంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రిన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55, 60, 65, 70, 75, 80, 85 కేజీల విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాస రాజు, స్టార్ బాడీబిల్డింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.విజయ్‌కుమార్, బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.గౌరీశంకర్, కోశాధికారి బట్న నవీన్, యువత పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఏటీఎం కార్డు మార్చేసి..
రూ.1.63 లక్షలు దోచేసి..

శ్రీకాకుళం క్రైమ్ : ఓ రిటైర్డ్ అధికారి వద్ద ఏటీఎం కార్డు మార్చేసి రూ.1,63,900 కొట్టేసిన వైనం జిల్లా కేంద్రంలోని అరసవల్లి మిల్లు కూడలి సమీప ఎస్బీఐ ఏటీఎంలో చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలో ఎస్బీఐ ఏటీఎం సెంటర్‌కు ఓ రిటైర్డ్ అధికారి వెళ్లి రూ.9 వేలు విత్‌డ్రా చేశారు. కార్డును మిషన్ నుంచి తీయకుండానే పక్కనే ఆ డబ్బులు లెక్కపెడుతుండగా వెనుకగా నిల్చొన్న గుర్తు తెలియని వ్యక్తి గమనించాడు. క్షణాల్లో అధికారి కార్డు తీసేసి తన కార్డును మిషన్‌లో పెట్టేశాడు. సార్ మీ కార్డు మిషన్‌లో ఉంచేశారు.. తీయండి అంటూ సాయం చేసినట్లు నటించి అక్కడి నుంచి పరారయ్యాడు. అక్కడికి రెండు రోజుల తర్వాత ఎస్బీఐ యోనోయాప్ ద్వారా బ్యాలెన్స్ చెక్ చేయగా రూ.1,63,900 ఎవరో ఏటీఎం కార్డు ద్వారా విత్‌డ్రా చేసినట్లు అధికారి గ్రహించారు. వెంటనే తన వద్దనున్న ఏటీఎం కార్డు తీసుకెళ్లి తనిఖీ చేయగా బ్యాలెన్స్ తక్కువగా కనిపించడంతో వెంటనే సంబంధిత మెయిన్ బ్రాంచి (ఎస్బీఐ) అధికారులను కలవగా కార్డును బ్లాక్ చేసి స్టేట్‌మెంట్ తీసి చూపించి పోలీసులను ఆశ్రయించాలన్నారు.



పలుచోట్ల తీసి.. చివరికి ఒడిశాలో..

స్టేట్‌మెంట్‌లో మోసం చేసిన వ్యక్తి ముందుగా విశాఖపట్నం శ్రీ సంఘవి జ్యూయలర్ మాల్ ఏటీఎం వద్ద రూ.75 వేలు, అశీల్‌మెట్ట ఏటీఎం వద్ద రూ.10 వేలు, అదే చోట రెండుసార్లు రూ.10 వేలు, మరోసారి రూ.వెయ్యి తీశాడు. అక్కడి నుంచి ఒడిశా రాష్ట్రంలోకి వెళ్లి బరంపురం సిటీ హాస్పిటల్ రోడ్డులో రూ.10 వేలు, అదేచోట మూడుసార్లు రూ. 10 వేలు చొప్పున, చివరికి గజపతి జిల్లా సూర్యా హాల్‌మార్క్ వద్ద రూ.17,900 తీశాడు. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివప్రసాద్



నూతన కార్యవర్గమిదే

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం(2025–26) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అనంతరం లెక్కింపు చేపట్టారు. 604 మందికి గాను 529 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు. అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ చేయగా తంగి శివప్రసాద్ 272 ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా ఇప్పిలి సీతరాజు, ప్రధాన కార్యదర్శిగా పిట్టా దామోదరరావు, మహిళా ప్రతినిధిగా గురుగుబెల్లి వనజాక్షి విజయం సాధించారు. ఇప్పటికే కార్యదర్శిగా మాటూరి భవానీప్రసాద్, కోశాధికారిగా కొమర శంకరరావు, గ్రంథాలయ కార్యదర్శిగా కొమ్ము రమణమూర్తి, క్రీడా కార్యదర్శిగా త్రిపురాన వరప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, ఎస్.విజయ్‌కుమార్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అగూరు ఉమామహేశ్వరరావు, మామిడి క్రాంతి, బి.వి.రమణ తదితరులు అభినందించారు.